GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 296 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | బుధవారం 30.04.2025 | పేజీలు : 3

## ఆర్మీకి ఫ్రీ హ్యాండ్

### ప్రధాని నరేంద్ర మోదీ

**టీ మీడియా, ఏప్రిల్ 29, ఢిల్లీ :**



ఉగ్రవాదాన్ని అణచివేసే విషయంలో సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇస్తున్నామని ప్రధాన నరేంద్ర మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించడంపై దృఢ చిత్తంతో ఉన్నామని చెప్పారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై పూర్తి విశ్వాసం ఉందని ప్రధాని పునరుద్ఘాటించారు. కార్యాచరణ రూపొందించుకోవడంలోనూ సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ఎప్పుడు, ఎలా స్పందించాలో నిర్ణయించే స్వేచ్ఛ సైన్యానికి ఉందన్నారు.ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంగళవారం కీలక భద్రత సమావేశం జరిగింది. దాదాపు గంట పాటు జరిగిన ఈ మీటింగ్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్‌తో పాటు త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. కాగా, ఉగ్రవాదులు, వారిని పోషిస్తున్నవారిని కఠినంగా శిక్షిస్తామని ప్రధాని మోదీ ప్రతిజ్ఞ చేసిన నేపథ్యంలో ఈ మీటింగ్ జరగడం గమనార్హం.




# రూ.6.6 లక్షల కోట్ల రుణ ప్రణాళిక

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఎస్ఎల్‌బీసీ సమావేశం

## రాష్ట్రానికి రూ.3000 కోట్ల విలువైన ప్రాజెక్టులు

**టీ మీడియా, ఏప్రిల్ 29, అమరావతి బ్యూరో :**

ఆర్థిక సంవత్సరానికి రూ.6,60,000 కోట్ల రుణ ప్రణాళికను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. గత ఏడాది కంటే 22 శాతం అధికంగా రుణ ప్రణాళికకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్లు ఆమోదం తెలిపారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన 231వ ఎస్ఎల్‌బీసీ సమావేశమై వివిధ నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రానికి రూ.వేల కోట్ల విలువైన ప్రాజెక్టులు వస్తున్నాయనీ అండగా నిలవాలని బ్యాంకర్లను సీఎం కోరారు. ఎంఎస్ఎంఈలకు బ్యాంకులు చేయూతనివ్వాలనీ స్పష్టం చేశారు.వచ్చే నాలుగేళ్లలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, సంపద సృష్టి, పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేపడుతున్నామని, ఓవైపు స్వర్ణాంధ్ర-2047 విజన్‌కు అనుగుణంగా పనిచేస్తూనే 2029 నాటికి పూర్తి చేయాల్సిన ప్రాజెక్టులు, లక్ష్యాలపై ప్రధానంగా దృష్టి పెట్టామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి బ్యాంకులు సంపూర్ణ మద్దతివ్వాలని, 2025-26లో నిర్దేశించుకున్న క్రెడిట్ ప్లాన్ లక్ష్యాలను అధిగమించేలా కృషి చేయాలని సచివాలయంలో జరిగిన 231వ స్టేట్ లెవెల్ బ్యాంకర్ల కమిటీ సమావేశంలో సీఎం సూచించారు.ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్: 2024-25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఫలితాలపై బ్యాంకింగ్ అధికారులతో చర్చించిన సీఎం, 2025-26 లక్ష్యాలను నిర్దేశించారు. 100 శాతం లక్ష్యాలను అధిగమించి దక్షిణ భారతదేశంలోనే మేటిగా ఉన్నందుకు బ్యాంకర్లను సీఎం అభినందించారు. సమావేశంలో 2025-2026 ఆర్థిక సంవత్సరానికి 'ఏపీ యాన్యువల్ క్రెడిట్ ప్లాన్'ను సీఎం ఆవిష్కరించారు. డ్వాక్రా మహిళలు, కౌలు రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఎదుగుదలకు ప్రత్యేకంగా ఏం చేయగలం అనేది బ్యాంకర్లు ఆలోచించాలని చెప్పారు. తరచూ ఎస్ఎల్‌బీసీ సమావేశాలు నిర్వహించడానికి ప్రధాన కారణం రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బ్యాంకుల మద్దతు కూడగట్టేందుకేనని అన్నారు.

**బ్యాంకుల మద్దతు తప్పనిసరి**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సేవలు, పరిశ్రమల రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చామని కానీ రాష్ట్ర విభజన తర్వాత ప్రాధాన్యతలు మారాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగ ఆధారిత రాష్ట్రం కావడం, దీనిపై ఎక్కువమంది ఆధారపడి జీవిస్తుండటంతో వ్యవసాయరంగానికి అండగా నిలిచామన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలను సైతం బలోపేతం చేసేలా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఏ రంగం పురోగతి సాధించాలన్నా బ్యాంకుల మద్దతు తప్పనిసరి అని చెప్పారు.వివిధ రంగాల్లో భారీగా ప్రాజెక్టులు వస్తున్నాయని, వాటికి అవసరమైన ఆర్థిక మద్దతు ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. ఇంటికో ఎంట్రప్రెన్యూర్ లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, అలాగే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు సీఎం చెప్పారు. 2029 కల్లా పేదరికం నిర్మూలించేలా జీరోపావర్టీ-పీ4 అమలు చేసి అసమానతలు తొలిగించేలా కృషి చేస్తున్నామని తెలిపారు. సంపద సృష్టికి, మౌలిక సదుపాయాల కల్పనకు పీపీపీ విధానాన్ని రాష్ట్రంలో విస్తృతంగా అమలు చేస్తున్నామన్నారు.

**మహిళా ఎంట్రప్రెన్యూర్లకు ప్రాధాన్యత**

అమరావతి భవిష్యత్ అవకాశాలకు వేదికగా చేస్తున్నామని, అటు రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్‌గా, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని సీఎం అన్నారు. పెట్రో కారిడార్‌పై బ్యాంకర్లు దృష్టి పెట్టాలని, మత్స్యకారులు మధ్యవర్తుల ప్రమేయంతో నష్టపోతున్నారని వారికి నేరుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. సముద్ర ఆర్థిక వ్యవస్థలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అద్భుతాలు చేయొచ్చని దీనికి బ్యాంకర్ల మద్దతు అవసరమన్నారు. ప్రత్యేకంగా మహిళా ఎంట్రప్రెన్యూర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వివరించారు. స్వయం సహాయక బృందాలకు రుణాలు విరివిగా అందిస్తున్నామని చెప్పారు. అలాగే ఎడ్యుకేషన్, హౌసింగ్ విషయంలోనూ ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు.

**127 శాతం వృద్ధి నమోదు**

2024-25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం క్రెడిట్ ప్లాన్ రూ.5,40,000 కోట్లు లక్ష్యం పెట్టుకోగా, లక్ష్యాన్ని అధిగమించి రూ.6,83,672 కోట్ల రుణాలు అందించినట్టు బ్యాంకర్లు వివరించారు. నిర్దేశించిన లక్ష్యంలో 127 శాతం వృద్ధి నమోదు చేసినట్టు తెలిపారు. ప్రాథమిక రంగానికి రూ.4,14,824 కోట్లు, ఇతర రంగాలకు రూ.2,68,848 కోట్లు అందించామనీ వెల్లడించారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్ల మేర రుణ ప్రణాళిక లక్ష్యంగా పెట్టుకుని రూ.3,07,089 కోట్ల రుణాన్ని బ్యాంకులు అందించాయనీ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఖరీఫ్‌లో రూ.1,69,797 కోట్లు, రబీలో రూ.1,37,291 కోట్లు రుణాన్ని అందించినట్టు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ఎంఎస్ఎంఈ రంగాలకు ఈసారి భారీ ఎత్తున్న క్రెడిట్ ప్లాన్ అమలు చేసినట్టు బ్యాంకర్లు వివరించారు. గత ఏడాది రూ.87,000 కోట్ల లక్ష్యానికి గాను రూ.95,620 కోట్లు ఇచ్చాయి. ఇందులో మైక్రో ఎంట్రప్రైజెస్‌కు రూ.49,552 కోట్లు, స్మాల్ ఎంట్రప్రైజెస్‌కు రూ.27,632 కోట్లు, మీడియం ఎంట్రప్రైజెస్‌కు రూ.18,138 కోట్లు, ఇతర వాటికి రూ.298 కోట్లు రుణంగా అందించాయి.

# నిజమైన దోషులు భారత్‌లోనే ఉన్నారు




**రాకేష్ తికాయత్**

**టీ మీడియా, ఏప్రిల్ 29, ఢిల్లీ :** పెహల్గామ్ దాడిపై భారతీయ కిసాన్ యూనియన్ (బికెయు) రైతు నేత చౌదరి రాకేష్ తికాయత్ మంగళవారం వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పెహల్గామ్ దాడికి పాల్పడిన నిజమైన దోషులు పాకిస్తాన్‌లో లేరు. రక్తపాతం వల్ల లబ్దిపొందుతున్నవారే నిజమైన దోషులు. వారు భారత్‌లోనే ఉన్నారని రాకేష్ తికాయత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అసలు ఈ హింస వల్ల ఎవరు లాభపడుతున్నారు? హిందువులు- ముస్లింలు అని ఎవరు వేరు చేస్తున్నారు? ఈ ప్రశ్నకు సమాధానం ఈ వ్యక్తులలోనే ఉంది అని తికాయత్ వ్యాఖ్యానించారు. ఉదాహరణఖకు ఒక గ్రామంలో హత్య జరిగితే.. ఈ సంఘటన వల్ల ప్రయోజనం పొందే వ్యక్తిని పోలీసులు మొదట అరెస్టు చేస్తారు. అదేవిధంగా ఈ హింస వల్ల ప్రయోజనం పొందుతున్న వారు పాకిస్తాన్‌లో కాదు.. భారత్‌లోనే ఉన్నారు. మరి ఈ హింసవల్ల ఎవరికి లాభం జరుగుతుందో వారిపై ఎందుకు దర్యాప్తు చేయడం లేదు అని ఆయన ప్రశ్నించారు.

కాగా, పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి వల్ల పర్యాటకులపై తీవ్ర ప్రభావం పడిందని ఈ ఘటనతో సందర్శకులు తగ్గారని తికాయత్ అన్నారు. ఈ దాడి తర్వాత కాశ్మీర్ ప్రజలతో తాను మాట్లాడానని.. ఆ సమయంలో వారంతా నాశనమైందని బాధపడేవారే కానీ.. ఈ దాడి జరగడానికి గల కారణంపైన.. దానికి సంబంధించిన అసలు ప్రశ్నపైన ఎవరు దృష్టి పెట్టడం లేదు అని ఆయన ఆవేదన చెందారు. మూడేళ్ల క్రితం జమ్మూకాశ్మీర్‌లో పండించే యాపిల్స్‌పై నిషేధం విధించారు. 22 రోజులపాటు జాతీయ రహదారులపై ట్రక్కుల్లో యాపిల్ పండ్లు నిలిచిపోయాయి. దీనివల్ల జరిగే నష్టాన్ని ప్రతిరోజూ లెక్కించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పుడు కూడా దాడి తర్వాత శ్రీనగర్‌లో పండ్లను, పర్యాటక ప్రదేశాలను నిలిపివేస్తే.. అవి నాశనమవుతాయి. పర్యాటకరంగంపై తీవ్ర ప్రభావం పడుతుంది అని ఆయన అన్నారు. ఇలాంటి దాడుల వల్ల ఎవరికి ప్రయోజనం చేకూరుతుందో అందరికీ తెలుసు. కానీ ఎవరు నోరు విప్పడం లేదు అని తికాయత్ వ్యాఖ్యానించారు.

## ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు

# రూ.50లక్షలు, ప్రభుత్వ ఉద్యోగం

**మహారాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయం**



**టీ మీడియా, ఏప్రిల్ 29, ముంబై**

మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన రాష్ట్ర పౌరులకు ఆ రాష్ట్ర ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ. 50 లక్షల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ మంగళవారం వెల్లడించారు. దీంతో పాటు వారి కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వనున్నట్లు వివరించారు. మంగళవారం మహారాష్ట్ర కేబినెట్? సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

**వీటికి కూడా కేబినెట్ ఆమోదం**

హడాస్‌పూర్ నుంచి యావత్ మధ్య రాష్ట్ర రహదారిని ఆరు వరుసలుగా విస్తరించేందుకు ఆమోదం తెలిపింది. షిప్ యార్డ్, షిప్ రీసైక్లింగ్ అభివృద్ధి పనులకు ఒకే చెప్పింది. మహారాష్ట్ర ఎలక్ట్రిక్ వెహికిల్ పాలసీ 2025ని ఆమోదించింది. యాప్ ఆధారంగా నడిచే వాహనాలకు అగ్రిగేటర్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది. ముల్షీ జిల్లాలోని తెగ్‌మర్ ప్రాజెక్ట్ రివైజ్డ్ అంచనాలను రూ.488.53 కోట్లకు పెంచేందుకు అంగీకరించింది. పీఎం యశస్వీ పథకం కింద ఇచ్చే ఓబీసీ, ఈబీసీ, డీఎస్టీ స్కాలర్?షిప్?ల సవరించిన మార్గదర్శకాలను అమలు చేసేందుకు ఓకే చెప్పింది. ఓబీసీలకు ఇచ్చే రుణాల పరిధిని రూ. 10లక్షల నుంచి 15 లక్షలకు పెంచేందుకు అంగీకరించింది. గిరిజనుల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేయాలని నిర్ణయించింది. రైతుల కోసం సమగ్ర పంటల బీమా పథకం అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**మృతుల్లో మహారాష్ట్ర వారే ఎక్కువ**

జమ్ము కశ్మీర్ పహల్గాంలో మినీ స్విట్జర్లాండ్‌గా పిలిచే బైసరన్ లోయలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యటకులు మరణించగా, అనేక మంది గాయపడ్డారు. ఆర్మీ దుస్తుల్లో వచ్చిన ముష్కరులు అతి సమీపం నుంచి పర్యటకులపైన కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఐఏఎఫ్ కార్పోరల్, నేవీ, ఎక్సైజ్ అధికారి కూడా మరణించారు. అయితే మృతుల్లో ఎక్కువ మంది (ఆరుగురు) మహారాష్ట్రకు చెందిన పర్యాటకులు ఉన్నారు. ముంబయికి చెందిన దిలీప్ దేసాలే, హేమంత్ జోషి సుహాస్, థానేకు చెందిన అతుల్ శ్రీకాంత్ మోని, సంజయ్ లక్ష్మణ్ లేలే, పుణెకు చెందిన సంతోష్ జగ్దాలే, కస్తోబే గనోవోటే మరణించారు.

## తెలంగాణ టెన్త్ ఫలితాలు

**మధ్యాహ్నం ఒంటి గంటకు**

**విడుదల చేయనున్న సీఎం రేవంత్‌రెడ్డి**




**టి మీడియా, ఏప్రిల్ 29, హైదరాబాద్ బ్యూరో:**

లక్షలాది మంది విద్యార్థులు ఎప్పుడెప్పుడా అని ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న పదో తరగతి పరీక్షల ఫలితాలు బుధవారము విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు రవీంద్ర భారతిలో విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు జరగ్గా దాదాపు 5లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తి కావడం, మార్కుల మెమోలను ఎలా ఇవ్వాలన్న అంశంపై పూర్తిస్థాయిలో క్లారిటీ రావడంతో అధికారులు ఫలితాల విడుదలకు రంగం సిద్ధం చేశారు. విద్యార్థులు తమ ఫలితాలను https://bse.telangana.gov.in, results.eenadu.net లో ఒక్క క్లిక్‌తోనే పొందొచ్చు.

**-ఇకపై మార్కుల మెమోలు ఇలా**

పదో తరగతిలో ఈ సారి మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 8న పాఠశాల విద్యాశాఖ నుంచి ప్రతిపాదన పంపగా దాదాపు 20 రోజుల సమయంలో నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు ఇచ్చారు. గత సంవత్సరం వరకు పదో తరగతిలో సబ్జెక్టులవారీగా గ్రేడింగ్‌తో పాటుగా క్యుములేటివ్ గ్రేడింగ్ పాయింట్ యావరేజ్ (సీజీపీఏ) ఇచ్చేవారు.

**-పాస్, ఫెయిల్**

ఇక నుంచి పదో తరగతి మెమోల్లో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లు ఇవ్వనున్నారు. జీపీఏ అనేది తీసివేయనున్నారు. మార్కుల మెమోలపై సబ్జెక్టులవారీగా రాత పరీక్షలు, ఇంటర్నల్ పరీక్షల మార్కులు, మొత్తం మార్కులు, గ్రేడు పొందుపరచనున్నారు. చివరగా విద్యార్థి పాసయ్యారా? ఫెయిల్ అయ్యారా? అనేది వివరంగా ఇస్తారు. ఇంకా బోధనేతర కార్యక్రమాల(కో కరిక్యులర్ యాక్టివిటీస్)లో స్టూడెంట్స్‌కు గ్రేడ్లు ఇస్తారు.

**-సీబీఎస్ఈ తరహాలోనే**

వాల్యూ ఎడ్యుకేషన్ అండ్ లైఫ్ ఎడ్యుకేషన్, వర్క్ అండ్ కంప్యూటర్ ఎడ్యుకేషన్, ఆర్ట్ అండ్ కల్చరల్ ఎడ్యుకేషన్, ఫిజికల్ అండ్ హెల్త్ ఎడ్యుకేషన్ అనే నాలుగు కో కరిక్యులర్ యాక్టివిటీస్‌కు సంబంధించిన గ్రేడ్లు కూడా ముద్రిస్తారు. ప్రస్తుతం సీబీఎస్ఈలో సబ్జెక్టులవారీగా మార్కులు, గ్రేడ్లను ముద్రిస్తున్నారు. సీబీఎస్ఈలో అన్ని సబ్జెక్టుల మార్కులు కూడి, మొత్తం ఎన్ని మార్కులో ఇవ్వడం లేదు. ఇక్కడా అదేవిధంగా ఉంటుందా అందుకు భిన్నంగా మొత్తం మార్కులు పొందుపరుస్తారా అనేది ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రపంచ సుందరి పోటీలకు

### కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**



**టీ మీడియా,ఏప్రిల్ 29, హైద్రాబాద్ బ్యూరో:**

ప్రపంచ సుందరి 2025 పోటీకి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మే నెల 10 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మిస్ వరల్డ్ 2025 ఏర్పాట్లపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ లో 72 వ మిస్ వరల్డ్ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్ల వివరాలను సమావేశంలో అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే అతిథులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసే అతిథుల కోసం ఎయిర్ పోర్టు, వారు బస చేసే హొటళ్లు, కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి గారు పోలీసు అధికారులను ఆదేశించారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు అతిథుల ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కార్యక్రమాలకు సంబంధించి విభాగాల వారిగా పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులనునియమించాలని సూచించారు.నగరంలో పెండింగ్లోఉన్న బ్యూటిఫికేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని, మిస్ వరల్డ్-2025 ప్రారంభమయ్యే నాటి నుంచి పూర్తయ్యే వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, పూర్తి చేయాల్సిన పనులు, ఏర్పాట్లకు సంబంధించి పూర్తి స్థాయి ప్రణాళికను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు.

# కడుపు ఎందుకు మండుతోంది కేసీఆర్

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

మిగతా 3లో..

# సోషల్ మీడియా నియంత్రణ, సందిగ్ధత

శనగపాటి మురళీ కృష్ణ
(ఫ్రీలాన్సర్, టి మీడియా కుటుంబం)

సోషల్ మీడియాపై కఠినమైన నియంత్రణ కోసం సుప్రీంకోర్టు ఇచ్చిన పిలుపు భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆందోళనలను లేవనెత్తుతోంది.సోషల్ మీడియా నియంత్రణ: ఎలక్ట్రానిక్స్ , ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ ప్రసంగంపై, ముఖ్యంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లపై నిబంధనలను బలోపేతం చేయాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ నుండి పెరుగుతున్న ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఇది సామాజిక విలువలను కాపాడటంలో ,మహిళలు, పిల్లల గౌరవాన్ని కాపాడటంలో నియంత్రణ పర్యవేక్షణ పాత్రపై చర్చలను రేకెత్తించింది. సోషల్ మీడియా , యూట్యూబ్ ఛానెల్‌లలో అశ్లీలతను అరికట్టడానికి నియంత్రణ చర్యలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వాన్నిసుప్రీంకోర్టు కోరింది. ఈ న్యాయపరమైన ప్రోత్సాహం వాక్ స్వేచ్ఛను సమతుల్యం చేస్తూ డిజిటల్ పర్యవేక్షణ ఆవశ్యకతపై విస్తృత చర్చకు తోడ్పడుతుంది.

### భావ ప్రకటనా స్వేచ్ఛపై ఆందోళనలు

సుప్రీంకోర్టు వ్యాఖ్యల కారణంగా, ప్రభుత్వం భావ ప్రకటనా స్వేచ్ఛను తగ్గించే కఠినమైన నిబంధనలను విధించే అవకాశం ఉందని డిజిటల్ హక్కుల కార్యకర్తలు భయపడుతున్నారు. అటువంటి చర్యలు పూర్తిగా సెన్సార్‌షిప్‌గా పరిగణించరాదని సుప్రీంకోర్టు నొక్కిచెప్పినప్పటికీ, రాజ్యాంగ పరిధిలో కంటెంట్‌ను నియంత్రించడానికి నిర్మాణాత్మక చట్రం అవసరాన్ని కూడా అది నొక్కి చెప్పింది.ప్రభుత్వం ఈ సంక్లిష్టమైన నియంత్రణ ప్రక్రియను పరిష్కరిస్తున్నందున, న్యాయ లేదా శాసన మార్గాల ద్వారా అమలు చేయడానికి ముందు వాటాదారుల నుండి ఇన్‌పుట్‌లను కోరుతూ ఏదైనా ప్రతిపాదిత నిబంధనలను ప్రజాక్షేత్రంలో ఉంచాలని సుప్రీం కోర్టు సూచించింది.

### నియంత్రణలో ప్రపంచ ధోరణులు

డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల హానికరమైన ప్రభావాలను తగ్గించే దిశగా ప్రపంచవ్యాప్త ఉద్యమంతో సోషల్ మీడియాను నియంత్రించడానికి భారతదేశం చేస్తున్న ప్రయత్నాలు ఏకీభవిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలు తమ పౌరులను, ముఖ్యంగా యువ వినియోగదారులను, సోషల్ మీడియా ప్రమాదాల నుండి రక్షించడానికి చురుకైన చర్యలు తీసుకుంటున్నాయి.ఉదాహరణకు, ఆస్ట్రేలియా యువ టీనేజర్లు , పిల్లలకు సోషల్ మీడియా యాక్సెస్‌పై నిర్వచించబడని నిషేధాన్ని అమలు చేయడానికి కట్టుబడి ఉంది. ఇంతలో, దక్షిణ కొరియా సియోల్‌లో పునరావాస కేంద్రాలను ప్లాన్ చేయడం ద్వారా డిజిటల్ వ్యసనాన్ని పరిష్కరిస్తోంది, యువతలో అధిక మొబైల్ ఫోన్ వినియోగానికి ప్రతిస్పందిస్తోంది.యునైటెడ్ కింగ్‌డమ్‌లో, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు హానికరమైన కంటెంట్‌పై రిస్క్ అసెస్‌మెంట్ నివేదికలను సమర్పించడానికి గడువు ఇవ్వబడింది.యు కె యొక్క ఆన్‌లైన్ భద్రతా చట్టం ప్రకారం, ఫేస్బుక్, ఇనిస్ట్రాగ్రామ్,టిక్ టాక్ వంటి ప్లాట్‌ఫామ్‌లు ఉగ్రవాదం, ద్వేషపూరిత నేరాలు, పిల్లల దోపిడీ మరియు ఆర్థిక మోసాలకు సంబంధించిన నష్టాలను పరిష్కరించాలి. గత సంవత్సరం, యుకె కూడా సోషల్ మీడియా సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌లపై నేర కార్యకలాపాలకు వ్యతిరేకంగా ముందస్తు చర్యలు తీసుకోవాలని చట్టాన్ని ఆమోదించింది.



### ప్రస్తుత సోషల్ మీడియా నిబంధనలు

చారిత్రాత్మకంగా, భారతదేశంలో సోషల్ మీడియా నియంత్రణ ప్రధానంగా డేటా రక్షణ మరియు గోప్యతపై దృష్టి పెట్టింది. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం, 2023 కింద దేశం డేటా ప్రొటెక్షన్ బోర్డును ఏర్పాటు చేసింది. ఈ చొరవ భారతదేశ డేటా గవర్నెన్స్ ప్రయత్నాలలో ఒకముఖ్యమైనఅడుగుగాప్రశంసించబడినప్పటికీ, బోర్డు స్వతంత్ర గురించి ఆందోళనలు కొనసాగుతున్నాయి, ఎందుకంటే దాని ఎంపిక ప్రక్రియ ప్రభుత్వం నుండి పూర్తి స్వయంప్రతిపత్తికి హామీ ఇవ్వదు.మరో ముఖ్యమైన సమస్య ఏమిటంటే, తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి, హింసను ప్రేరేపించడానికి ,నేర కార్యకలాపాలను సులభతరం చేయడానికి సోషల్ మీడియాను దుర్వినియోగం చేయడం. 2023 ఐటీ నియమాల సవరణ ప్రకారం, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు ,ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సహా ఆన్‌లైన్ మధ్యవర్తులు భారత ప్రభుత్వం గురించి తప్పుడు సమాచారం యొక్క వ్యాప్తిని నిరోధించాలి. మూడవ పక్ష కంటెంట్‌కు వ్యతిరేకంగా చట్టపరమైన రక్షణను నిలుపుకోవడానికి వాస్తవ తనిఖీ యూనిట్లు తప్పుగా ఫ్లాగ్ చేయబడిన కంటెంట్‌ను తొలగించాల్సిన అవసరం ఇప్పుడు ప్లాట్‌ఫారమ్‌లకు ఉంది.

### సమతుల్యతను సాధించడం

సోషల్ మీడియా నియంత్రణపై జరుగుతున్న చర్చ కీలకమైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. ప్రభావవంతమైన పర్యవేక్షణ అంటే ఏమిటి? ప్రభుత్వాలు వాక్ స్వాతంత్ర్య సూత్రాలను కాపాడుతూ ఆన్‌లైన్ హానిని ఎలా నిరోధించగలవు? ప్రపంచవ్యాప్తంగా ఉన్న విభిన్న రాజకీయ , సాంస్కృతిక దృశ్యాలను దృష్టిలో ఉంచుకుని, ఒకే పరిమాణానికి సరిపోయే విధానం అసాధ్యమైనది. ప్రతి దేశం దాని సందర్భానికి బాగా సరిపోయే నియంత్రణ స్థాయిని నిర్ణయించుకోవాలి.ప్రజా భద్రత కోసం సోషల్ మీడియా నియంత్రణ అవసరమని ప్రభుత్వాలు వాదిస్తున్నప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై రాజకీయ ప్రభావం పెరుగుతుందనే ఆందోళన కూడా పెరుగుతోంది. విస్తారమైన మార్కెట్ ఉన్న భారతదేశం ఇప్పటికే టెక్ కంపెనీలపై గణనీయమైన నియంత్రణను కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా, ప్రభుత్వాలు వ్యాపార ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని ప్లాట్‌ఫామ్‌లను తమ ప్రయోజనం కోసం రాజకీయ కంటెంట్‌ను నియంత్రించేలా చేస్తాయి.ఉదాహరణకు, గూగుల్ ఒకప్పుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజకీయ ఒత్తిడితో గల్ఫ్ ఆఫ్ మెక్సికోను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా పేరు మార్చింది. అదేవిధంగా, ప్రభుత్వాలు నిబంధనలకు అనుగుణంగా లేని టెక్ కంపెనీలను భారీ పన్నులు లేదా వాటి మార్కెట్ యాక్సెస్‌కు బెదిరింపుల ద్వారా బెదిరించడం తెలిసిందే.భారతదేశంలో, అధికార పార్టీ భావజాలానికి అనుగుణంగా లేనందుకు జర్నలిస్టుల కంటెంట్ సెన్సార్ చేయబడిన అనేక సందర్భాలు వెలుగులోకి వచ్చాయి . థాయిలాండ్‌లో ఇలాంటి కేసులు నమోదయ్యాయి, అక్కడ ప్రభుత్వ ఒత్తిడి కారణంగా కార్యకర్తలు, జర్నలిస్టులు మరియు మీడియా కార్యనిర్వాహకులు పోస్ట్ చేసిన కంటెంట్ తొలగించబడింది.

### నైతిక నియంత్రణ అవసరం

సోషల్ మీడియాను నియంత్రించడం తప్పనిసరి అయినప్పటికీ, అటువంటి చర్యలు భిన్నాభిప్రాయాలను అణిచివేసే సాధనాలుగా మారకుండా ప్రభుత్వం చూసుకోవాలి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు బలవంతపు ఒత్తిళ్లకు గురయ్యే అవకాశం, ముఖ్యంగా భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో, పారదర్శ, ప్రజాస్వామ్య నియంత్రణ ప్రక్రియ యొక్క అవసరాన్ని హైలైట్ చేస్తుంది.ఏకపక్ష ప్లాట్‌ఫామ్ నియమాలను సవాలు చేయడంలో పౌర సమాజం మరియు వినియోగదారు సహకారం కీలక పాత్ర పోషిస్తాయి. స్వతంత్ర వాస్తవ తనిఖీ విధానాలను బలోపేతం చేయడం , నిష్పాక్షికమైన కంటెంట్ నియంత్రణ విధానాలను ప్రోత్సహించడం వినియోగదారులను శక్తివంతం చేయగలదు .యంత్రణ సెన్సార్‌షిప్‌గా మారకుండా చూసుకోవచ్చు. ఇంకా, టెక్ కంపెనీల మధ్య సమన్వయ చర్య ప్రభుత్వ అతిక్రమణకు వ్యతిరేకంగా ప్రతిఘటనగా ఉపయోగపడుతుంది. వనరులను సమీకరించడం, ఐక్యంగా నిలబడటం ద్వారా, ప్లాట్‌ఫామ్‌లు స్వేచ్ఛా వ్యక్తీకరణ యొక్క ప్రధాన విలువలను కొనసాగిస్తూ అనవసరమైన ఒత్తిడిని నిరోధించగలవు.

భారతదేశం తన సోషల్ మీడియా నిబంధనలతో ముందుకు సాగుతున్నప్పుడు, ఆన్‌లైన్ హాని నుండి వినియోగదారులను రక్షించడం మరియు ప్రజాస్వామ్య చర్చను కాపాడటం మధ్య సున్నితమైన సమతుల్యతను సాధించాలి. ప్రభావవంతమైన పర్యవేక్షణ పారదర్శకంగా, భాగస్వామ్యాత్మకంగా,రాజకీయ పక్షపాతాలు లేకుండా ఉండాలి. డిజిటల్ రంగంలో భద్రత మరియు స్వేచ్ఛ రెండింటినీ సమర్థించే నియంత్రణ చట్రాన్ని రూపొందించడంలో పౌర సమాజం, పరిశ్రమ వాటాదారులు, విధాన రూపకర్తల మధ్య సహకార ప్రయత్నాలు చాలా అవసరం.

## ఉద్యమ ఆకాంక్షలే జన సమితి లక్ష్యం

- ఖాదర్ పాష

**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**



వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో జన సమితి జెండా ఆవిష్కరించిన జిల్లా అధ్యక్షులు యంఏ. ఖాదర్ పాష.ఈ సందర్భంగా ఖాదర్ పాష మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాదనే తమ ముందున్న తక్షణ కర్తవ్యం అని జన సమితి పార్టీ జిల్లా అధ్యక్షులు ఖాదర్బాషా పేర్కొన్నారు. ఏడు సంవత్సరాల కాలంలో ఎన్నో అద్భుత విజయాలను సాధించిందని, తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రజలకు ఇచ్చిన తెలంగాణ ఆకాంక్షలను నెరవేర్చడానికి అహర్నిశలు కృషి చేసిందని అన్నారు. నిరుద్యోగ సమస్యపై, రైతాంగ సమస్యపై, ఆర్టీసీ సమస్యలపై, ఆదివాసీల సమస్యలపై పోరాడుతూనే ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం శ్రమించిందని అన్నారు. గత పది సంవత్సరాలు రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతున్న నియంతృత్వ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి ప్రజలను చైతన్యం చేసిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ ఉద్యమ ఆకాంక్షల సాధనకు కృషి చేస్తుందని ఖాదర్ పాష వెల్లడించారు. ఈ జన సమితి పార్టీ ఏడవ ఆవిర్భావ వేడుకలు పార్టీ కార్యాలయంలో ఘనంగా జరిగాయని అన్నారు. ఈ కార్యక్రమంలోయండి. షఫీ మైనార్టీ జిల్లా నాయకులు, పిక్కిలి బాలయ్య, మండల అధ్యక్షులు శాంతారామ్ నాయక్, కె వినోద్ కుమార్,మైనుద్దీన్ సాబ్,జన సమితి జిల్లా నాయకులు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లి లలిత జయంతి వేడుకలు

**టీ మీడియా, ఏప్రిల్ 29, భువనగిరి :**



శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ గాన కోకిల, తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకురాలు బెల్లి లలితక్క జయంతి వేడుకలను యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కోసం బరి గీసి కొట్లాడిన వీర వనిత బెల్లి లలితక్క అని, ఆమె ఆశయాల కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మంచినీళ్ల కోసం ఫ్లోరైడ్ సమస్య, వ్యభిచార నిర్మూలన కోసం ,సమ సమాజ స్థాపన కోసం అహర్నిశలు శ్రమించి తన పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేసిన గొప్ప మహా ప్రజా నాయకురాలని అన్నారు. తన పాటల ద్వారా తెలంగాణ ప్రజలలో వస్తున్న చైతన్యన్నీ తట్టుకోలేక కొన్ని దుష్టశక్తులు 17 ముక్కలుచేసి చంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అమరవీరుల పేరుపైన భవనం నిర్మించి, బెల్లి లలితక్క విగ్రహాన్ని జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసి ఆమె స్మారకార్థం ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పాఠ్య పుస్తకాలలో లలితక్క జీవిత చరిత్రను చేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లి చంద్రశేఖర్ యాదవ్, గుండెబోయిన సురేష్ యాదవ్, ర్యాకాల రమేష్ యాదవ్, పార్వతి దశరథ యాదవ్, రంజిత్ యాదవ్, మధుకర్ యాదవ్, పుట్ట శివ యాదవ్, భాగ్యరాజు యాదవ్, బాత్క అశోక్ యాదవ్, బదుగు ఉదయ్, అవుశెట్టి వంశి యాదవ్, శ్రీ కృష్ణ యాదవ్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా విద్యాశాఖ అధికారికి వినతి

**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**



వనపర్తి పట్టణంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని తో ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై చర్చించిన దయానంద్ ముదిరాజ్.వనపర్తి జిల్లాలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యావ్యవస్థను వ్యాపారం చేస్తూ ప్రైవేటు ఉపాధ్యాయులను ప్రచార కార్యకర్తలుగా ముందస్తు అడ్మిషన్ల కోసం ఇళ్లు తిప్పుతున్న ఎందుకు స్పందించట్లేదని జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రశ్నించారు. టీచర్లుమండుటెండలో సైతం కనీసం నైతిక విలువలు పాటించకుండా మహిళలను కూడా చూడకుండా ఇష్టానుసారంగాను అడ్మిషన్లు టార్గెట్లు ఇచ్చి ఉపాధ్యాయుని ఇబ్బందుల గురి చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పైన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు ఎందుకు స్పందించట్లేదు. ఎలక్షన్స్ సమయంలో ఆత్మీయ సమ్మేళనాలు పేరుతో ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నిస్తున్నారు. హామీలు దేవుడెరుగుకనీసంమాఆత్మ గౌరవందెబ్బతింటున్న పట్టించుకునే వాళ్ళులేరని వారిగోడు డినిఎల్లపుచ్చు కుంటున్నారు. మే నెలలో జీతాలు అందజేసే విధంగా ప్రవేట్ యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో చర్యలు చేపట్టాలని కోరారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలపై విద్యార్థి సంఘాల నాయకులు కూడా మద్దతు ప్రకటించాల్సిన భాధ్యత తీసుకోవాలనీ కోరారు.తక్షణమే సంబంధిత మండల విద్యాధికారులకు ఆదేశాలు అందజేస్తామని డీఈవో తెలియజేశారు.

## కాంగ్రెస్ వెన్నులో వణుకు పుట్టించిన సభ

- కె.సి.ఆర్ పిలుపుకు అండగా నిలిచిన లక్షలాది ప్రజానీకం

**టి మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వైఫల్యంతో కె.సి.ఆర్ పిలుపుకు అండగా నిలిచిన లక్షలాది ప్రజానీకం. నిరంజన్ రెడ్డి నాయకత్వములో తరలివచ్చిన ప్రజలకు,పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపిన గట్టు యాదవ్ జిల్లా అధ్యక్షులు,వాకిటి.శ్రీధర్ జిల్లా అధికార ప్రతినిధి. వరంగల్ రజతోత్సవ సభకు కుంభమేళను తలపించే విధంగా తరలివచ్చి సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్ అన్నారు.నిరంజన్ రెడ్డి స్వగృహంలో జరిగిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడుతూ కుట్రలు, కుతంత్రాలు,దుష్ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు,420 హామీలు అమలు పర్చలేక ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకున్నదని విమర్శించారు.రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తెచ్చి పడిగాపులు కాస్తున్న కుంటి సాకులు చెప్పి ప్రభుత్వంలో చలనం లేదని దుయ్యబట్టారు.సభకు వచ్చిన స్పందన చూసి ప్రభుత్వం ఆటంకాలు సృష్టించిందని ట్రాఫిక్ అదుపు చేయడంలో పోలీస్ అధికారులు విఫలమైనారని దానితో 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి ప్రజలు నానా ఇబ్బంది పడ్డారని అయిన మొక్కవోని దీక్షతో లక్షలాది తరలివచ్చి ప్రజలు కె.సి.ఆర్ కి అండగా నిలిచారని అన్నారు. నిరంజన్ రెడ్డి నాయకత్వంలో స్వచ్ఛందంగా తరలివచ్చి సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు.ఈ సమావేశములో జిల్లా పట్టణ పార్టీ అధ్యక్షుడు పలుస.రమేష్ గౌడ్,మీడియా కన్వీనర్ నందిమల్ల. అశోక్, యువత అధ్యక్షులు సూర్యవంశం.గిరి.మాజీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నీలస్వామి, తోట.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద దాడికి నిరసనగా బంద్

- స్వచ్ఛందముగా పాల్గొన్నవ్యాపారులు

**టీ మీడియా,ఏప్రిల్ 29,పెద్దపల్లి :**



పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడికి వ్యతిరేకంగా మంగళవారం పెద్దపల్లిలో బంద్ నిర్వహించారు .ఉగ్రదాడిలో చనిపోయిన మృతుల ఆత్మకు శాంతిచేకూరాలని కోరూతూ పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ బంద్‌కు పిలుపునిచ్చింది.ఈ నేపథ్యంలో పట్టణంలోవ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు .ఒక్క షాపు కూడా తెరచుకోక పోవడంతో వీధులన్నీ బోసిపోయి కనిపిస్తున్నా యి.పెద్దపల్లి కూరగాయల మార్కెట్ జెండా చౌరస్తా కమాన్ రోడ్‌లో బంద్

## శిలాపలకం వేశారు రోడ్డు మరిచారు

**టీ మీడియా,ఏప్రిల్ 29,ఎండపల్లి:**



శిలాపలకాలకే అంకితమైన సీసీ రోడ్లు ఎండపల్లి మండలంలో దర్శనమియడం శరామాములే , మండలంలోని గోడిసెలపేట గ్రామంలోని పదవ వార్డు సీసీ రోడ్డు నిర్మాణం కొరకు గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 5లక్షల నిధులతో సీసీ రోడ్డు మంజూరు చేశారు. కానీ పనులు మాత్రం సున్నా.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ. సంవత్సరాలు గడిచిన నిర్మాణం పనులు చేపట్టడం లేదని, సీసీ రోడ్డు నిర్మాణం కొరకై 2021,7,20వ తేదీన శిలాపలకం వేసి శంకుస్థాపన చేశారుఅని కాని శిలాపలకం శిలాపలకంగానే దర్శనమిస్తుందని సీసీ రోడ్డు పనులు మాత్రం నిర్మించడం లేదని వాపోయారు. పదవ వార్డ్ లోని గంగాధర బక్కయ్య ఇంటి నుండి సబ్బు నర్సయ్య ఇంటి వరకు సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి మరిచారాని, ప్రభుత్వాలు మారిన నిర్మాణం పనులు మాత్రం చేపట్టడం లేదని చిన్న పాటి వర్షానికే దారి బురుదమయం అవుతుందని, నడవడానికి ఇబ్బంది కరంగా ఉంటుందని. వర్షాకాలం,రాకముందే సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలని,అలాగే త్రాగు నీటి సమస్య కూడ ఉందని తక్షణమే స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పందించి సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## డంపింగ్ యార్డ్‌ని సందర్శించిన అదనపు కలెక్టర్

**టీ మీడియా, ఏప్రిల్29, మేడ్చల్:**



అదనపు కలెక్టర్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా రాధికా గుప్త మంగళవారం రోజు గాగిల్లాపూర్ తండా లోని రామ్ కి డంపింగ్ యార్డ్ ని సందర్శించి దుండిగల్ మునిసిపాల్టీ లో విలువడే చెత్త ను ప్రాసెసింగ్ చేయటానికి తాగు సూచనలు చేసారు, అదేవిధంగా డంపింగ్ యార్డ్ చుట్టూ కాంపౌండ్ వాల్ ఏర్పాటు చేయవలసిందిగా ఆదేశించినారు. ఇట్టి కార్యక్రమంలో దుండిగల్ మున్సిపల్ కమిషనర్ , నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ అదేవిధంగా గండి మైసమ్మ దుండిగల్ , బాచుపల్లి తహసిల్దారులు పాల్గొన్నారు.



## ఆత్మరక్షణకై మార్షల్ ఆర్ట్స్

- బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టీ మీడియా, ఏప్రిల్ 29, మేడ్చల్:**

ఇటీవల సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చాలెంజ్ మార్షల్ ఆర్ట్స్ నాన్ స్టాప్ స్పీడ్ పంచెస్ పోటీలలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభతో మెడల్స్ సాధించిన క్రీడాకారులు ఈరోజు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచి క్రీడాకారులను మెడల్స్ సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆత్మ రక్షణకు మాత్రమే యుద్ధకళలను ప్రదర్శించినట్లయితే విద్య సంపూర్ణంగా పూర్తి చేయగలమని, అదేవిధంగా గురువుల పట్ల కూడా అంతే వినయంగా ఉండాలన్నారు. సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్క మహిళ చిన్నతనం నుండి పిల్లలకు కరాటే శిక్షణ ఇప్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో బుడోకాయ్ వ్యవస్థాపకుడు కామేశ్వరరావు కట్టా తేజశ్రీ, దాసరి అక్షయ్, ధీరజ్ రతన్ రెడ్డి, కుశలవ, ఝాన్సీ, ప్రవీణ్ నాయక్, ప్రేమ్ కుమార్, చాలా హరీ రామ్ చంద్ర శేఖర్, అంకుష్, వందన, సోహన్ వీర్, అనీల్, ప్రణీత్ రెడ్డి, కేశిరెడ్డి, వేదాన్ష్, నాగ సాయి, దేవ్ చరణ్, విశాల్, హరినాన్షి, త్రివేద్, దుర్గ, క్రీడాకారులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

**టీ మీడియా,ఏప్రిల్ 29,పెద్దపల్లి :**



పెద్దపెల్లి జిల్లా కోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా వచ్చిన జస్టిస్ సునీతా కుంచాల ను మంగళవారం జిల్లా కోర్టు లో,జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పుష్పగుచ్చం అందించి మర్యాద పూర్వకంగా కలిశారు.



## బస్టాండ్‌ను సందర్శించిన డిప్యూటీ ఆర్ ఎం

**టీ మీడియా, ఏప్రిల్ 29, భువనగిరి:**

నూతనంగా డిప్యూటీ ఆర్ ఎం గా భాద్యతలు తీసుకొన్న సుచరిత, మంగళవారం యాదగిరిగుట్ట వెళుతూ మార్గమధ్యంలోని భువనగిరి బస్ స్టేషన్ ను సందర్శించారు. ప్రయాణికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ప్లాట్ ఫాం పక్కన గల మహిళల టాయ్లెట్స్ కు వెళ్ళే దారిని వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. బస్టాండ్ లోని వాటర్ ట్యాంక్ ను వెంటనే శుభ్రం చేయాలని స్టేషన్ మేనేజర్ వెంకటయ్య ను ఆదేశించారు. బస్టాండ్ లోని పలు దుకాణాలు సందర్శించి ఎం ఆర్ పి కంటే ఎక్కువ ధరకు అమ్మ రాదని అన్నారు. బస్టాండ్ లో ఉన్న క్యాంటీన్ లో కూరగాయలను శుభ్రంగా కడిగి వండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెూటల్ యాజమాన్యంను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల కొరతను , ప్రయాణికుల సమస్యలను, టాయ్లేట్ల పరిశుభ్రత గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్టీసీ బస్ స్టేషన్ మేనేజర్ వెంకటయ్య, కంట్రోలర్ సోమరాజు, యాదగిరిగుట్ట టిఐ– 2 శ్రీనివాస్, మణికంఠ, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ పాల్గొన్నారు.

నూతనంగా డిప్యూటీ ఆర్ ఎం గా భాద్యతలు తీసుకొన్న సుచరిత, మంగళవారం యాదగిరిగుట్ట వెళుతూ మార్గమధ్యంలోని భువనగిరి బస్ స్టేషన్ ను సందర్శించారు. ప్రయాణికులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా గజ్వేల్ ప్లాట్ ఫాం పక్కన గల మహిళల టాయ్లెట్స్ కు వెళ్ళే దారిని వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. బస్టాండ్ లోని వాటర్ ట్యాంక్ ను వెంటనే శుభ్రం చేయాలని స్టేషన్ మేనేజర్ వెంకటయ్య ను ఆదేశించారు. బస్టాండ్ లోని పలు దుకాణాలు సందర్శించి ఎం ఆర్ పి కంటే ఎక్కువ ధరకు అమ్మ రాదని అన్నారు. బస్టాండ్ లో ఉన్న క్యాంటీన్ లో కూరగాయలను శుభ్రంగా కడిగి వండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హెూటల్ యాజమాన్యంను ఆదేశించారు. ఆర్టీసీ బస్సుల కొరతను , ప్రయాణికుల సమస్యలను, టాయ్లేట్ల పరిశుభ్రత గురించి ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి ఆర్టీసీ బస్ స్టేషన్ మేనేజర్ వెంకటయ్య, కంట్రోలర్ సోమరాజు, యాదగిరిగుట్ట టిఐ– 2 శ్రీనివాస్, మణికంఠ, సామాజిక కార్యకర్త కొడారి వెంకటేష్ పాల్గొన్నారు.

# అటెండెన్స్ తక్కువగా ఉందా?

- రూ.5000 కట్టాల్సిందే
- అటానమస్ కళాశాలల దోపిడీ



**టి మీడియా, ఏప్రిల్ 29, హైదరాబాద్ బ్యూరో :**
జేఎన్‌టీయూ పరిధిలోని స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన కళాశాలలుభారీగాముడుపులుతీసుకుంటున్నాయి. వ్యక్తిగత ఇబ్బందులు, అనారోగ్యంతో తరగతులకు హాజరుకాని నాలుగో సంవత్సరం విద్యార్థుల నుంచి భారీగా దండుకుంటున్నాయి. వైద్యుడి ధ్రువపత్రం సమర్పించాక ఒక్కో విద్యార్థి నుంచి కండోనేషన్ ఫీజు పేరిట రూ.5 వేలు వసూలు చేస్తున్నారు.చివరి సెమిస్టర్‌లో హాజరు తప్పనిసరి కాదని అధికారులు చెబుతున్నా కాలేజీ యాజమాన్యం వినడం లేదని విద్యార్థులు వాపోతున్నారు. నెలలో ఐదారు రోజులు ప్రాజెక్టులు సమర్పించేందుకు కళాశాలకు వస్తే చాలని గతంలో వారే తెలిపారంటున్నారు. ఇప్పుడు మాత్రం రూ.5 వేలు చెల్లిస్తేనే పరీక్షలు రాయిస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా మాట మార్చితే ఆ డబ్బును ఎలా చెల్లించాలని విద్యార్థులు వాపోతున్నారు.

**నార్మల్‌గా రూ.500 లు**

నార్మల్‌గా అయితే హాజరు శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు పరీక్షలు రాయాలంటే వైద్యుడి ధ్రువపత్రం పాటు రూ.500 చెల్లిస్తే సరిపోతుంది. కానీ జేఎన్‌టీయూ పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో మాత్రం రూ.500 వసూలు చేస్తుండగా, స్వయం ప్రతిపత్తి హోదా కలిగిన ఇంజినీరింగ్ కళాశాలల్లో మాత్రం రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు వసూలు చేస్తున్నారు.ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో 8, మేడ్చల్ జిల్లాలో 4 అటానమస్? కళాశాలల యాజమాన్యాల్లో నిబంధనలకు విరుద్ధంగా వసూళ్ల పర్వం సాగుతోంది. ఇందులో మేడ్చల్? జిల్లాలోని ఓ అటానమస్ కాలేజీలో రూ.5 వేలు వసూలు చేస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ఈ సమస్యపై జేఎన్?టీయూ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.

# 48పర్యటక ప్రాంతాల మూసివేత

- ఉగ్రదాడులు జరగొచ్చని వార్నింగ్

**టి మీడియా, ఏప్రిల్ 29, జమ్ము కశ్మీర్ :**
పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో జమ్ము కశ్మీర్?లో ఉన్న 87 పర్యటక ప్రాంతాల్లో 48 ప్రదేశాలను మూసివేశారు. ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని భద్రతా ఏజెన్సీల హెచ్చరికలతో జమ్ము కశ్మీర్ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కశ్మీర్ లోయలో కొంత మంది స్లీపర్ సెల్స్ యాక్టివ్ అయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతావర్గాలు హెచ్చరించాయి. ఉత్తర, మధ్య, దక్షిణ కశ్మీర్ ప్రాంతాల్లో భారీ దాడులకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ఇంటిలిజెన్స్ వర్గాలు వార్నింగ్ ఇచ్చాయి. ముఖ్యంగా శ్రీనగర్, గండేర్బల్ ప్రాంతంలోని కశ్మీర్ పండిట్‌లు, అధికారులను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది.




**రైల్వే సిబ్బందికి వార్నింగ్**

వీరితో పాటు లోయలోని రైల్వే సిబ్బంది, మౌలిక సదుపాయాలపైనా దాడులు జరిగే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. రైల్వే అధికారులతో పాటు సిబ్బంది తమ క్యాంపులు, బ్యారక్?లను విడిచి ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించింది. ఇంటిలిజెన్స్ సమాచారంతో అప్రమత్తమైన భద్రతాదళాలు, సున్నిత ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించాయి. ముఖ్యంగా గుల్మార్గ్, సోన్‌మార్గ్, దాల్ లేక్ లాంటి పర్యటక ప్రాంతాల్లో భద్రతను పటిష్ఠం చేశారు. యాంటీ ఫిదాయీన్ స్క్వాడ్స్‌తో పాటు జమ్ము కశ్మీర్? పోలీసులను మోహరించారు.

**వరుసగా ఐదో రోజూ కాల్పుల విరమణ**

మరోవైపు భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ సరిహద్దు వెంబడి కాల్పుల కొనసాగుతున్నాయి. పాకిస్థాన్ సైన్యం వరుసగా ఐదో రోజు రాత్రి కూడా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు దిగింది. అఖ్నూర్ సెక్టార్‌లోని నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు పాల్పడినట్లు మంగళవారం సైనిక వర్గాలు తెలిపాయి. ఏప్రిల్ 28-29 రాత్రి సమయంలో కుప్వారా, బారాముల్లా జిల్లాలోని నియంత్రణ రేఖ వద్ద పాకిస్థాన్ కాల్పులకు తెగబడినట్లు పేర్కొన్నాయి. దీన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టిందని, ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలిపాయి. అంతకుముందు రోజు పూంఛ్ సెక్టార్‌లో పాక్ ఆర్మీ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. కాగా, ఏప్రిల్? 22న జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యటకులు మరణించారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ క్రమంలోనే పాకిస్థాన్, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## యంగ్ ఇండియా శిక్షణా శిబిరం ప్రారంభం

**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**
విద్యార్థులు వేసవి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియగం చేసుకోవాలని యాపర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో ఉపాధ్యాయులు పలుస శంకర్ గౌడ్ కోరారు. రాష్ట్ర విద్యా శాఖ సూచన మేరకు ఆయన సోమవారం యంగ్ ఇండియా శిక్షణా శిబిరాన్ని హై స్కూల్ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వేసవి సెలవులలో నలభై రోజుల పాటు ప్రాథమిక ,ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల కోసం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా కాలంలో పిల్లలకు స్పోకెన్ ఇంగ్లీషు,గణితంలో బేసిక్స్,ఇతర సబ్జెక్ట్ లతో పాటు చెస్ క్యారమ్స్ టెన్నిస్ గ్రామీణ ఆటలలో శిక్షణను ఇవ్వడం జరుగు తుందన్నారు.ఆయా సబ్జెక్టు లలో నిపుణులైన ఉపాధ్యాయులను నియమించడం జరిగిందని హెడ్మాస్టర్ శంకర్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నరేందర్ రెడ్డి,స్వరాజ్యం బాబు రెడ్డి, మాసుం ఉపాధ్యాయులు మైనొద్దీన్,ఈశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు,బైరోజు చంద్ర శేఖర్,అనూష,కవిత,వైష్ణవి దాదాపు ఎనభై మంది బాల బాలికలు పాల్గొన్నారు.



## శరగవేగంగా గుడుల నిర్మాణాలు

**టీ మీడియా ,ఏప్రిల్ 29, ఆత్మకూరు :**
వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పోచమ్మ,కర్రెమ్మ, గుడుల నిర్మాణం భేస్మెంట్ వరకు పూర్తవగా కోట మైసమ్మ, భూలక్ష్మమ్మ, కట్ట మైసమ్మ,గుడుల నిర్మాణాలు నెమ్మదిగా కొనసాగుతున్నావి. అందుకు గల కారణాలు రెవెన్యూ పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆలయకమిటి సభ్యులు తెలిపారు. గ్రామ దేవతల గుడుల నిర్మాణమే లక్ష్యంగా విరాళాలు సేకరించేందుకు వస్తున్న సభ్యులకు అండగా ఉండాలని, గ్రామదేవతల గుడుల నిర్మాణ కమిటి సభ్యులు చందాలు ఇవ్వాలని ఎంతో వైభవోపేతంగా ఒక పట్టణంలా ఒక వెలుగు వెలిగిన ఆత్మకూర్ అభివృద్ధికి అడ్డంకిగా మారిన గ్రామ దేవతల గుడులు శిథిలావస్థకు చేరుకోవడం ధూపదీప నైవేద్యాలకు గ్రామదేవతలు నోచుకోకపోవడం వల్లనే ఆత్మకూరు పై ఆదేవతల ప్రభావం తీవ్రంగా చూపుతుందని పెద్దలు అందుకు అన్నివిధాలా ఆలోచించి ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేసేందుకు,ముందుగా గ్రామదేవతల గుడుల నిర్మాణమే లక్ష్యంగా సమావేశం ఏర్పాటు చేసుకుని కఠినతరమైన ఒక నిర్ణయం తీసుకుని గ్రామదేవతల గుడుల నిర్మాణం కోసం దాదాపు రెండు కోట్లకు పైగా ఖర్చులు అవుతున్న నేపథ్యంలో అందుకోసం విరాళాలు సేకరించేందుకు కంకణం కట్టుకుని గ్రామ దేవతల గుడుల నిర్మాణంలో మిమ్మల్ని కూడా భాగస్వామ్యం చేస్తూ విరాళాలు సేకరించేందుకు మీ చెంతకు వస్తున్నారు.ఆత్మకూరు పట్టణ ప్రజలు వ్యాపారస్తులు అందుకు మీ వంతుగా సహకారం అందించాలని కోరుకుంటున్నారు.గ్రామ దేవతల గుడులు నిర్మిద్దాం ఆత్మకూరు అభివృద్ధికి పాటు పడాలని పెద్దమ్మ తల్లి గుడి నిర్మాణ కమిటి అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ కమిటీ సభ్యులు కోరారు.



## మంత్రి పర్యటనకు పకడ్బందీ చర్యలు

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలో బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వనపర్తి జిల్లా పర్యటనను విజయవంతం చేసేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం మంత్రి వనపర్తి జిల్లాలో పాల్గొననున్న కార్యక్రమం ప్రదేశాలను, హెలిపాడ్ ను కలెక్టర్ సందర్శించారు. అనంతరం కలెక్టర్ తన ఛాంబర్ లో అధికారులతో మాట్లాడి దిశానిర్దేశం చేశారు. మంత్రి పర్యటన సందర్భంగా వనపర్తి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నూతనంగా నిర్మించిన పి.జి విద్యార్థుల వసతి భవనం, అధ్యాపకుల భవనం ప్రారంభోత్సవం చేయనున్నారు. మండల అభివృద్ధి కార్యాలయ సముదాయంలో ఏర్పాటు చేసిన మోడల్ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభోత్సవం చేస్తారు. అక్కడే రేవల్లి, ఎదుల, శ్రీరంగాపూర్ తహసిల్దార్ కార్యాలయ భవనములకు శంఖుస్థాపన చేయనున్నారు. కె.డి.ఆర్ పాలిటెక్నిక్ కళాశాల వెనక భాగంలో ఆధునీకరించిన బి.సి. బాలుర కళాశాఖ వసతి గృహం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెరువు సుందరీకరణ ప్రారంభోత్సవం చేస్తారు. అనంతరం కల్యాణసాయి గార్డెన్ ఫంక్షన్ హాల్లో రైతులకు భూ భారతి చట్టం పై అవగాహన ఆదస్సు, మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు బాధ్యతలు తీసుకోవాలని బాధ్యతలు అప్పగించారు.అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్చార్జి యాదయ్య, రోడ్లు భవనాలు కార్యనిర్వాహక ఇంజనీర్ దేశ్య నాయక్, ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి, జిల్లా బి.సి. సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, పి.డి. హౌసింగ్ పర్వతాలు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## పరామర్శించిన జిల్లెల ఆదిత్య రెడ్డి

**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి మండల్ రాజపేట గ్రామానికి చెందిన వెంకట్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యానికి గురి అయ్యి నిమ్స్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వనపర్తి నియోజకవర్గ యువ నాయకుడు ఏఐపిసి నేషనల్ హెడ్ (హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్) డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి వెంకట్ ను పరామర్శించారు. ఆరోగ్యం నిలకడగా మెరుగుపడుతుందని ధైర్యంగా ఉండాలని వెంకట్ కు మనోధైర్యం చెప్పారు. డాక్టర్లతో మాట్లాడి వెంకట్ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ధర్మారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.



# గడపగడపకు జై బాబు, జై భీమ్, జై సంవిదాన్ నినాదం

- కష్టకాలంలో పార్టీకి పనిచేసిన వారికే ప్రాధాన్యత




**టీ మీడియా, ఏప్రిల్ 29, వనపర్తి బ్యూరో :**
గాంధీ అహింసవాదాన్ని అంబేద్కర్ ఆశయ సాధనను రాజ్యాంగ పీఠికను పరిరక్షించుకునే అవసరం ఎంతైనా ఉందని భావించి కాంగ్రెస్ పార్టీ చేపట్టిన జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం గడపగడపకు తీసుకెళ్లి ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన అవసరం ఎంత ఉందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం వనపర్తి పట్టణంలోని ఆర్ జి గార్డెన్లో నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.పార్లమెంట్ సాక్షిగా జై భీమ్ అన్న పదాన్ని అవమానపరుస్తూ భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని భావించిన కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.జై బాబు,జై భీమ్, జై సంవిధాన్ రాష్ట్ర సమన్వయకర్త కీర్తిశేషులు గద్దర్ అన్నగారి కుమార్తె వెన్నెలమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే సూచించారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన వారికే ప్రాధాన్యత ఉంటుందని ఎవరు ఎలాంటి నిరాశ నిస్పృహలకు లోను కాకూడదని ఎమ్మెల్యే సూచించారు.కుటుంబ పార్టీలో ఉన్న చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి పోతుంటాయి కానీ కాంగ్రెస్ పార్టీ కుటుంబం అంతా ఒక్కటేనని ఆయన పేర్కొన్నారు.సోషల్ మీడియా వేదికగా కాంగ్రెస్ పార్టీపై విషప్రచారం చేసే వారికి బుద్ధి చెబుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రతి పథకాలను ఇంటింటికి చేరవెయ్యాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యాపరంగా, వైద్యం పరంగా, సాగునీటిపరంగా, తాగునీటిపరంగా, వ్యవసాయపరంగా రుణమాఫీ, రైతు భరోసా, రైతు బోనస్, రోడ్ల నిర్మాణం పరంగా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు లాంటి అనేక పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే సూచించారు. ధరణి పోర్టల్తో అందిన కాడికి భూ కబ్జాలు చేశారని నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో ప్రతి రైతు సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.వనపర్తి నియోజకవర్గంలో ఒకేరోజు 1000 కోట్ల పనులకు గౌరవనీయ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టామని మరికొద్ది రోజుల్లోనే మరో వెయ్యి కోట్ల రూపాయల అభివృద్ధి పనులను నియోజకవర్గానికి తీసుకురాబోతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. నిరుపేదల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు పనిచేస్తుందని రానున్న కాలంలో కాంగ్రెస్ పార్టీని ప్రతి ఒక్కరు ఆదరించాలని ఆయన కోరారు.అనంతరం సభ ప్రాంగణం నుంచి భగీరథ చౌరస్తా మీదుగా వివేకానంద చౌరస్తా మీదుగా రాజీవ్ గాంధీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు వారు జై బాబు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమం భారీ ర్యాలీని నిర్వహించారు.అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి వారు నివాళులు అర్పించారు.కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి కేశం నాగరాజు,జై బాబు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమ సమన్వయకర్త వెన్నెలమ్మ, జాన్ మొహమ్మద్ నసీర్,సంజీవ్ ముదిరాజ్,గౌరీ సతీష్ తోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజేంద్రప్రసాద్ యాదవ్ వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రమోదిని రెడ్డి, స్థానిక కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ చందర్, పీసీసీ సభ్యులు శంకర్ ప్రసాద్, ఓబీసీ జిల్లా అధ్యక్షులు కోట్ల రవి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వాల్య నాయక్, జిల్లా దిశా కమిటీ సభ్యులు శంకర్ నాయక్, ధనలక్ష్మి, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమేష్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాక మహేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దేవన్న యాదవ్, సేవాదల్ జిల్లా అధ్యక్షుడు జానకి రాముడు, మాజీ జిల్లా కార్యదర్శి తిరుపతయ్య అన్ని మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## పశువులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు

- వైద్య అదికారి భూర మనోజ్ కుమార్



**టీ మీడియా ఏప్రిల్ 29,ఎండపల్లి:**
పశువులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పశు వైద్య అదికారి భూర మనోజ్ కుమార్ గ్రామస్తులకు సూచించారు.మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పశు రక్షణ కార్యక్రమంలోపశువులను ఎండ వేడిమీ నుండి ఎలా కాపాడుకోవాలని రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పగటి ఉష్ణోగ్రతలు 42 సెంటిగ్రేడ్ లకు మించి నమోదు అవుతున్నాయి అని ఎండ తీవ్రత,వేడి గాలుల వలన ఉష్ణతాపానికి గురై పాడి పశువులు వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురవుతున్నాయి అని. పశు యాజమానులు ఇంటి దగ్గర పశు వులషెడ్నిర్మించుకోవాలని,పశువులను ఉదయం 10గంటలనుంచి సాయంత్రం 4గంటలవరకుఎండలో వదలకూడదుఅని,ఎత్తయినచెట్ల నీడపడేలాషెడ్లునిర్మించుకోవాలని, షెడ్లపైకొబ్బరిఆకులు కానీ తాటిచెట్ల ఆకులను లేదాతుంగనుకప్పాలి అని,వీటితో పాటుగా వరిగడ్డిని పరచి తరచూ నీటితో తడపటంద్వారా షెడ్లలో వేడిమి,వుడకబోతను తగ్గించవచ్చు అని షెడ్ల లోకి గాలి,వెలుతురు ధారాళంగా వచ్చేలా ఫ్యాన్లు,కూలర్లను ఏర్పాటు చేసు కోవాలి అని,పాడిగేదెలు, పాడిఆవులకువేసవిలో పచ్చిమేతను అందించేలాపశుగ్రాసాలనుసాగుచేయాలిఅని, ఉదయంపూటపచ్చి మేతను,సాయంత్రంఎండుగడ్డిని అందించా లి అని, పశు దాణాను నీటిలో కలిపి ఇవ్వాలి అని,పశువులకు ఎల్లప్పుడూ చల్లటి త్రాగునీరుని అందుబాటులోఉంచాలని, నల్లటి చర్మం కలిగిన గేదెలు ఎండను తట్టుకోలేవు కాబట్టి వాటిపై చల్లటి నీరు చల్లుతూ ఉండాలి అనిఆహారంలో మార్పులు, చేయాలనీ వడ దెబ్బ తగిలితేవెంటనే ప్రథమ చికిత్సచేపించాలని,అలాగే పశువులతో పాటు ఎండలో కాపరులు కూడ తగు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ రైతులకు సూచించారు.ఈ కార్యక్రమం లో గ్రామస్తులు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీలో కాల్‌మనీ దందా

- వడ్డీవ్యాపారుల అవతారమెత్తిన అధ్యాపకులు

**టీ మీడియా, ఏప్రిల్ 29, నూజివీడు:**
ట్రిపుల్ ఐటీలో కాల్‌మనీ దందా సాగుతోంది. ఈ వ్యవహారాన్ని నడిపిస్తుంది విద్యార్థులో లేక బయట వ్యక్తులెవరో అనుకుంటే మీరు పొరబడినట్లే. పిల్లలకు విద్యాబుద్ధులు పెంపొందించే అధ్యాపకులే ఈ దందాను నడిపించటం గమనార్హం. విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన వారు వడ్డీ వ్యాపారం చేస్తూ కాసులును పోగేసుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే



**వడ్డీకి రూపంలో రూ.5.5 కోట్లు**

ఏలూరు జిల్లా నూజివీడులోని ట్రిపుల్ ఐటీలో నలుగురు ఒప్పంద అధ్యాపకులు గత కొంతకాలంగా కాల్‌మనీ వ్యాపారం చేస్తున్నారు. పైసా పెట్టుబడి లేకుండా వారికి తెలిసిన వారు లేదా తోటి అధ్యాపకుల నుంచి రూ.2 వడ్డీకి అప్పు తీసుకుంటారు. ఈ డబ్బులను బయట వ్యక్తులకు రూ.10 వడ్డీకి ఇస్తారు. దీని ద్వారా దాదాపు రూ.5.5 కోట్ల వరకు బయట వ్యక్తులకు వడ్డీకి తిప్పుతున్నట్లు సమాచారం. వాహనాలను తాకట్టు పెట్టుకుని మరీ వడ్డీకి సొమ్ము ఇవ్వడం మొదలుపెట్టారు. తాకట్టు పెట్టుకున్న వాహనాలు ఏకంగా ప్రాంగణంలోని అధ్యాపకుల నివాసాల్లోని పార్కింగ్ స్థలాల్లో పెట్టి దందా చేస్తుండటం విడ్డూరం.ఇటీవల కాలంలో ఓ వ్యక్తి నుంచి రూ.4 లక్షలను తక్కువ వడ్డీకి తీసుకుని అధిక వడ్డీకీ బయట వారికి ఇచ్చారు. అనంతరం ఆ వ్యక్తి తన డబ్బులు ఇవ్వాలని అడగడంతో తాకట్టు పెట్టుకున్న కార్లలో ఒకటిని ఇవ్వాలని నిర్ణయించుకున్నారు. దానికి అతను స్పందిస్తూ తనకు కారు వద్దని డబ్బులు ఇవ్వాలనడంతో వివాదం మొదలైంది. చివరికి బాధితులందరూ కలిసి పోలీసులను ఆశ్రయించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వారు అధిక వడ్డీకి ఇచ్చిన సొమ్ములను ఒక్కొక్కరూ ముక్కుపిండి మరీ వసూలు చేసుకుంటున్నారు.

**విచారణ చేపట్టి చర్యలు**

ఈ విషయం వెలుగు చూసి 2 రోజులు దాటినప్పటికీ ఇప్పటి వరకు వారిపై ఎలాంటి చర్యలు లేవు. దీనిపై డైరెక్టర్ అమరేంద్ర స్పందించారు. ఆయన దీనిపై మాట్లాడుతూ విషయం తన దృష్టికి వచ్చిందని విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటమని తెలిపారు. అనుమతి లేకుండా వాహనాలు ప్రాంగణంలో ఉంచకుండా చూస్తామని అమరేంద్ర అన్నారు.

## నకిలీ సర్టిఫికెట్ల కలకలం

- అర్ధసైనిక బలగాల్లో ఉద్యోగాలు
- స్పెషల్‌బ్రాంచ్ విచారణలోవెల్లడి

**టి మీడియా, ఏప్రిల్ 29, ఆదిలాబాద్ :**
నకిలీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి సశస్త్ర సీమా బల్?లో అక్రమంగా చేరిన ఘటన విస్తుగొలుపుతుంది. ఉత్తర భారతానికి చెందిన కొందరు యువకులు ఆదిలాబాద్?, జయశంకర్ భూపాలపల్లి, మేడ్చల్?లోని పలు ప్రాంతాల్లో నివసిస్తున్నట్లు ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించి ఉద్యోగాలు పొందారు. ఉద్యోగాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో ఇచ్చే శిక్షణ సైతం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) విభాగంలో పనిచేసే జనరల్ డ్యూటీ(జీడీ) కానిస్టేబుళ్ల ఎంపిక కోసం కేంద్ర హోం మంత్రిత్వశాఖ 2023 డిసెంబర్‌లో ఉద్యోగ నోటిఫికేషన్ జారీ చేయగా, 2024 మార్చి నెలలో పరీక్షలు నిర్వహించింది. ఎంపికైన అభ్యర్థులకు 2024 అక్టోబర్‌లో విడతలవారీగా పోస్టింగ్‌లు ఇచ్చింది.ఇందులో రాజస్థాన్‌కు చెందిన మనోజ్ షెకావత్ ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో నివాసం ఉంటున్నట్లు నకిలీ సర్టిఫికెట్? సమర్పించి సీమాబల్‌లో ఉద్యోగం పొందినట్లు ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. షెకావత్ ధ్రువపత్రాలు కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లా స్పెషల్‌బ్రాంచ్ (ఎస్‌బీ)కు విచారణకు రాగా నకిలీ ఆధార్‌కార్డు, ఇతర సర్టిఫికెట్లు సమర్పించి నివాస ధ్రువపత్రం పొందినట్లు గుర్తించారు. అలానే ఇచ్చోడ మండలం ఇస్లాంనగర్ చిరునామాతో సూరజ్, కోకస్ మన్నూర్ చిరునామాతో గజేందర్, విషకర్మలు ఫేక్ సర్టిఫికెట్లు పత్రాలతో ఎస్?ఎస్?బీలో ఉద్యోగాలు పొందినట్లు కేసులు నమోదయ్యాయి.
ఈ విషయం తెలుసుకుని ఆర్మీ, పారా మిలటరీ విభాగాల్లో చేరటానికి తెలంగాణ నుంచి పోటీ తక్కువ ఉంటోంది. దీన్నే ఆసరా చేసుకున్న ఉత్తరభారతానికి చెందిన యువకులు ఆదిలాబాద్, మేడ్చల్?, భూపాలపల్లి జిల్లాల్లో నివాసం ఉంటున్నట్లు నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు రూఢీ అవుతోంది. ఈ నిర్వాకం వెనక స్థానికుల ప్రమేయంతో పాటు ఓ ముఠా హస్తం ఉన్నట్లు తెలిసింది.భూపాలపల్లిలో లక్ష్మీనగర్ జంగేడు గ్రామంలో 2-14 ఇంటి నంబర్ అడ్రస్?తో ఓ యువకుడు ఫేక్? సర్టిఫికెట్? సృష్టించటమే కాకుండా దాని ఆధారంగా ఎస్?ఎస్?బీలో వంటమనిషిగా ఉద్యోగం పొందినట్లు తెలుస్తోంది. ఆయన ఇచ్చిన ఇంటి నంబరును భూపాలపల్లిలోని మున్సిపల్ రికార్డుల ప్రకారం ఆరాతీస్తే గతంలో ఆ ఇచ్చిన ఇంటి నంబర్‌తో గతంలో ఓ పూరిగుడిసె ఉంది. ఇప్పుడు అక్కడ గుడిసె లేదు. దీంతో అభ్యర్థి సమర్పించింది నకిలీ సర్టిఫికెట్ అని రుజువవుతుంది.ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్‌లో ఉంటున్నట్లు 2024 సెప్టెంబర్ 27న రెసిడెన్షియల్ సర్టిఫికెట్? కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెవెన్యూ సిబ్బంది విచారణలో అలాంటి వ్యక్తి స్థానికంగా లేరని తేల్చారు. దీంతో ఆయన సమర్పించిన అర్జీని 2024అక్టోబర్ 16న రిజెక్ట్? చేశారు. కానీ సదరు అభ్యర్థి అదే నెంబర్‌తో మళ్లీ ఫేక్? సర్టిఫికెట్? సృష్టించి ఉద్యోగంలో చేరి ఇప్పుడు శిక్షణలో ఉన్నట్లు తెలుస్తోంది.మరో ఇద్దరు యువకుల్లో ఒకరు ఇచ్చోడ మండలంలోని ఇస్లాంనగర్ నివాసిగా, మరొకరు నేరడిగొండలో నివాసం ఉంటున్నట్లు నకిలీ పత్రాలు సృష్టించి ఉద్యోగంలో చేరినట్లు తెలిసింది.మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం వేంపల్లికి చెందినట్లుగా ఓ యువకుడు సర్టిఫికెట్? సమర్పించాడు. అయితే ఆ గ్రామంలో ఆ పేరుతో ఎవరూ లేరని గ్రామస్థులు తెలిపారు.

## కడుపు ఎందుకు మండుతోంది కేసీఆర్

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**టీ మీడియా, ఏప్రిల్ 29, నేలకొండపల్లి :** మొన్న వరంగల్ లో జరిగిన ఈ రాష్ట్రాన్ని చూస్తుంటే కడుపు మండుతోంది అని మాట్లాడారు కేసీఆర్ గారు... ఇందిరమ్మ రాజ్యంలో పేదోడు సన్న బియ్యం తింటున్నందుకా...! ఇందిరమ్మ ఇళ్లు పేదోళ్లకు ఇస్తున్నందుకా...? లేక రైతు సోదరులకు రుణమాఫీ సక్రమంగా చేసినందుకా...? ఎందుకు అని అడుగుతున్నాను అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి - 2025 చట్టంపై నిర్వహిస్తున్న అవగాహన సదస్సుల్లో భాగంగా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం సుర్దేపల్లిలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో మంత్రి పొంగులేటి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ప్రభుత్వం అనాలోచితంగా ... ఆర్భాటంగా ధరణి చట్టాన్ని రూపొందించిందన్నారు. పింక్ కలర్ షర్ట్ వేసుకున్న వారందరికీ చట్టాన్ని చుట్టం చేశారని ఆరోపించారు. వారి హయంలో మూడున్నరేళ్ల పాటు ధరణి ఉన్నా కనీసం విధివిధానాలు రూపొందించలేదని విమర్శించారు. ధరణి చట్టం వల్ల ఎంతో మందికి నష్టం జరిగింది తప్ప లాభం జరగలేదని తెలిపారు. ఆ నష్టాన్ని , కష్టాన్ని పూడ్చేందుకే భూ భారతి చట్టాన్ని ఇందిరమ్మ రాజ్యంలో.... సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తీసుకు రావడం జరిగిందన్నారు. 18 రాష్ట్రాల్లో ఉన్న రెవెన్యూ చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాక... ఆ చట్టాల్లో ఉన్న మంచి చెడులను అన్నింటినీ మేధావులు, రిటైర్డ్ అధికారులు, సీనియర్ కలెక్టర్లు తో చర్చించి పేదోళ్లకు న్యాయం జరిగే విధంగా భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందన్నారు. సమస్య ఏదైనా దానికి భూ భారతి తో శాశ్వత పరిష్కారం జరిగేలా ఈ చట్టం పనిచేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం మాదిరిగా కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి మాత్రమే చట్టం పనిచేయదని పార్టీలకు అతీతంగా ఏ పార్టీకి చెందిన వారైనా వారి సమస్యల్లో న్యాయం ఉంటే కచ్చితంగా వారికి ఈ చట్టం ద్వారా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. మేము తీసుకొచ్చిన చట్టంలో విధి విధానాలను వందరోజుల్లోనే రూపొందించి వాటిని ప్రజలకు అంకితం చేసే కార్యక్రమం ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి రోజు